క్లుప్తంగా

ఘనంగా వీరభద్రస్వామి మహా కుంభ నివేదన

పులివెందుల టౌన్ : పట్టణంలోని తూర్పు ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో మంగళవారం ఆలయ చైర్మన్ గూడూరు గురుప్రసాద్ ఆధ్వర్యంలో వీరభద్రునికి మహా కుంభ నివేదనను ఆర్పించారు. అంతకముసుపు వీరభద్ర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు బసవరాజు స్వామివారికి మహా కుంభ నివేదనను ఆర్పించి ఖడ్గ మంత్రాన్ని జపించారు. స్వామివారి ముందు అన్నం రాశిగా పోసి అందులో వివిధ రకాల కూరగాయలు, పంచామృతం, అప్పలను నైవేద్యంగా పెట్టి మహా మంగళ హారతులను పట్టారు. అనంతరం భక్తులకు మహా ప్రసాదాన్ని పంచిపెట్టారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బలిజ సంఘ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

రేపు మాంసం దుకాణాలు నిర్వహించరాదు

కమలాపురం : ఈనెల 26వ తేదీన గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మాంసం దుకాణాలు నిర్వహించరాదని నగర పంచాయతీ కమిషనర్ రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు చికెన్, మటన్ దుకాణాలు నిర్వహిస్తే రూ.5వేలు జరిమానా విధిస్తామని ఆయన హెచ్చరించారు. మాంసం దుకాణాల యజమానులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని సహకరించాలని ఆయన అందులో పేర్కొన్నారు.

మహిళలు ఆర్థిక పురోగతిని సాధించాలి

చింతకొమ్మదిన్నె : మహిళలు ఆర్థిక పురోగతిని సాధించాలని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సుధాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నగర శివార్లలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో మహిళల సంరక్షణపై అవగాహన సదస్సును నిర్వహించి మాట్లాడారు. మహిళలు శారీరకంగా, ధృడంగా, మానసికంగా, ఆర్థికంగా పురోగతిని సాధించాలన్నారు. మహిళలు ఒంటరిగా ప్రయాణిస్తున్నప్పుడు దిశ యాప్‌ను ఖచ్చితంగా ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల మహిళా సంరక్షణ కమిటీ సభ్యులు పర్వీన్, నిర్మల, కళ్యాణ పల్లవి, పరిమళ కుమారి తదితరులు పాల్గొన్నారు.

మట్కా బీటర్ల అరెస్ట్

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని బీసీ కాలనీ సమీపం నల్లగ్రౌండ్ వద్ద జమ్మలమడుగు పట్టణానికి చెందిన 9 మంది మట్కా బీటర్లతో పాటు ప్రొద్దుటూర్‌కు చెందిన నిర్వాహకురాలిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.63,450 నగదును స్వాధీనం చేసుకున్నట్లు మంగళవారం పట్టణ సీఐ సదాశివయ్య తెలిపారు. పట్టణానికి చెందిన రెడ్డయ్య, కమాల్‌బాషా, మార్క్, తిరుపతయ్య, శేఖర్, చిన్నటబులు, లక్ష్మీప్రసన్న, ప్రభావతి, సరోజమ్మలు ప్రజలకు ఆశచూపి డబ్బు సేకరించి మట్కా పట్టీలను ప్రొద్దుటూర్‌లోని నల్ల గ్రౌండ్ వద్ద దస్తగిరిపేటకు చెందిన పల్లె ప్రమీలమ్మకు పట్టీలు ఇస్తున్నట్లు సమాచారం రావడంతో మంగళవారం సాయంత్రం సిబ్బందితో కలసి దాడి చేశామన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతాం

డీఎస్పీ శ్రీనివాసులు



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

సింహాద్రిపురం : అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపుతామని పులివెందుల డీఎస్పీ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం ఆయన సింహాద్రిపురం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డితో వాహనాల తనిఖీ గురించి అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఎక్కడా అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ హాజీ బాష, హెడ్ కానిస్టేబుల్ మల్లారెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పురాతన ఆలయాలకు పూర్వ వైభవం

సింహాద్రిపురం : మండల పరిధి రావులకొలను గ్రామంలోని పురాతన ఆలయాలను మంగళవారం దేవదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శంకర బాలాజీ, ఏఈ గంగయ్యలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన ఆలయాలకు నిధులు మంజూరయ్యాయని.. త్వరలో పనులు ప్రారంభమవుతాయన్నారు. టీటీడీ కింద శివాలయానికి రూ.24 లక్షలు, రామాలయానికి రూ.14 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చొరవతో మంజూరయ్యాయన్నారు. స్థానిక నాయకులు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

కొండను ఢీ కొట్టిన ట్రాక్టర్

జమ్మలమడుగు రూరల్ : మండల పరిధి చిటిమిటిచింతల గ్రామ సమీపంలోని టోల్ గేట్ వద్ద జమ్మలమడుగు నుంచి ముద్దనూరు వైపు వస్తున్న ఫ్లయాష్ ట్యాంకర్‌ను ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ రాజశేఖర్ తప్పించబోయి పక్కనున్న కొండను ఢీ కొన్నాడు. ఈ ట్రాక్టర్ డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డారు.

సంక్షేమమే లక్ష్యంగా జగనన్న పాలన

ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ ఎం సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం ఎర్రగుంట్ల మున్సిపాలిటీలోని 18వ వార్డులో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంను నిర్వహించారు. ఎమ్మెల్యేకు స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారికి ఆ పథకం యొక్క పూర్తి సమాచారాన్ని వివరించి, దగ్గరుండి పథకాలకు దరఖాస్తు చేయించాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించే బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్న ప్రభుత్వానికి అన్ని వర్గాల ప్రజలు అండగా ఉండాలని ఆయన కోరారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి సురేంద్రనాథ్‌రెడ్డి, కమిషనర్ పి.జగన్నాథ్, కౌన్సిలర్ శివప్రసాద్, కో–ఆప్షన్ సభ్యులు డి.సూర్యనారాయణరెడ్డి, మహమ్మద్ రఫీ, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్‌లు వై విశ్వభార్గవరెడ్డి, జెక్కు చెన్నక్రిష్టారెడ్డిలు, వ్యవసాయ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, చిన్నషేట్‌లు, చాంద్‌బాషా, మహమ్మద్ గౌస్, ఇస్మాయిల్, కేవి సుబ్బారెడ్డి, వై వీరభద్రారెడ్డి, వార్డు సచివాలయ ఉద్యోగులు మున్సిపల్ అధికారులు హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆగ్రహం

పట్టణంలోని జాతీయ రహదారిపై కెబుల్ కోసమని బాగున్న రోడ్డుకు రంధ్రాలు వేస్తున్న వారిని ఎమ్మెల్యే మందలించారు. కోట్లాది రూపాయలతో నాల్గులైన్ల జాతీయ రహదారి వేస్తే మీరు ఇప్పుడు కెబుల్ కోసమని గుంతలు పెట్టడం ఏమిటని ప్రశ్నించి ఆ గుంతలను పూడ్చాలని వారికి సూచించారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మున్సిపల్ పరిధి 19వ వార్డులోని నడిపూరులో బుధవారం సాయంత్రం జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి ఎం.సురేంద్రనాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యార్థుల అభ్యసనాభివృద్ధికి కృషి చేయాలి

కమలాపురం : ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థుల అభ్యసనాభివృద్ధికి కృషి చేయాలని ఎంఈఓ జాఫర్ సాదిక్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో మండలంలోని హెచ్‌ఎంలకు ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన లిప్ కార్యక్రమంపై మంగళవారం శిక్షణ నిర్వహించారు. డీఆర్‌పీలు లక్షుమయ్య, ఎంవీఎస్ రాజులు తెలుగు, ఇంగ్లీష్, గణితం, సైన్స్, సోషియల్ సబ్జెక్టుల బోధనపై శిక్షణ నిచ్చారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ 6, 7, 8 తరగతుల విద్యార్థులకు ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన లిప్ కార్యక్రమంపై అవగాహన పెంచుకుని విద్యార్థుల అభ్యసనాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రతి పాఠ్యాంశ బోధనలో టీచింగ్ పీరియడ్, ప్రాక్టీస్ పీరియడ్‌ల ప్రకారం బోధన సాగాలన్నారు. విద్యార్థులను ఏ, బీ గ్రేడులుగా విభజించి వారి విద్యాభివృద్ధిపై దృష్టి సారించి రికార్డులు నిర్వహించాలన్నారు. విద్యార్థుల కేస్ స్టడీ నిర్వహణ చేపట్టాలన్నారు. రాష్ట్ర స్థాయి నుంచి స్కూలు స్థాయి వరకు లిప్ మీద హెచ్‌ఎం, ఎంఈఓ, డీఆర్‌పీ, ఎస్ఆర్‌పీ, డిప్యూటీ ఈఓ, డీఈఓ, డైట్ లెక్చరర్స్, యూనిసెఫ్ బృందం పర్యవేక్షిస్తారన్నారు. లిప్ పై ప్రతి ఉపాధ్యాయుడు మంచి అవగాహన కలిగి ఉండి విద్యార్థుల అభ్యసనాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌పీలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

బోధనపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి

ఎర్రగుంట్ల : ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన లర్నింగ్ ఇంప్రూమ్మెంట్ ప్రోగాంపై ఉపాధ్యాయులందరూ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని డీఆర్పీ గంగిరెడ్డి అన్నారు. మంగళవారం మండల విద్యాశాఖ కార్యాలయంలో ఉపాధ్యాయులకు ఆయన ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమం రెండు రోజుల పాటు ఎంఈఓ సుబ్బారావు ఆధ్వర్యంలో సాగింది. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వి.బ్రహ్మయ్య, ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డిలు పాల్గొన్నారు.

లిప్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

వేంపల్లె : ఉపాధ్యాయులు లిప్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మానటరింగ్ అబ్జర్వర్ సి.శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 6, 7, 8 తరగతులు బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా తరగతుల విద్యార్థులు చదవడం, రాయడంలో చాలా వెనుకబడి ఉన్నారని.. ఈ విషయాన్ని వివిధ సర్వేల ద్వారా ప్రభుత్వం గుర్తించిందన్నాను. రాష్ట్ర, జిల్లా, మండలస్థాయిలలో లిప్ అధికారులను ప్రభుత్వం నియమించిందని.. ప్రతి పాఠశాలలో కూడా ప్రీ పోస్ట్ నిర్వహించేలా చర్యలు తీసుకోవడం, గ్రేడింగ్‌లు రిపోర్ట్‌లో నమోద చేసేలా హెడ్మాస్టర్లు, హెడ్ టీచర్లు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ ప్రకాష్‌రెడ్డి, కళ్యాణి, నాగరాణి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం

మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప

పులివెందుల రూరల్ : రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయంలో మార్కెట్ యార్డు కమిటీ సభ్యులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయ సాధన లక్ష్యంగా రైతుల సంక్షేమం కోసం అనేక మౌలిక సదుపాయాలను మార్కెట్‌లో కల్పించడం జరిగిందన్నారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డిల పర్యవేక్షణలో చీనీ కాయల కొనుగోలు కేంద్రం కూడా త్వరలోనే ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కొద్ది రోజుల తర్వాత చీనీ కాయల వ్యాపారం కొనుగోలు చేసే విధంగా ప్రారంభిస్తామన్నారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలను అందించడం జరుగుతుందన్నారు. కమిటీ సహకారంతో మార్కెట్ యార్డును మరింత అభివృద్ధి చేస్తామన్నారు. గత ఏడాది ఆదాయం కంటే ఈ ఏడాది ఆదాయం మరింత పెరిగిందన్నారు. వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డి, మార్కెట్ యార్డు కార్యదర్శి రత్నరాజు, మార్కెట్ యార్డు సిబ్బంది పాల్గొన్నారు.

ఆడపిల్లను పుట్టనిద్దాం.. బతకనిద్దాం



కమలాపురం : ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, అంగన్‌వాడీ సిబ్బంది

కమలాపురం : ఆడపిల్లను పుట్టనిద్దాం... బతకనిద్దాం.. అని ఐసీడీఎస్ సూపర్ వైజర్ జయకుమారి తెలిపారు. మంగళవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలలో బేటి బచావో–బేటి పడావో కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి రంగంలో మహిళలు రాణిస్తున్నారని, మహిళలు, పురుషులతో సమానంగా ఉన్నారన్నారు. ఆడపిల్ల పుడితే నిరుత్సాహ పడవద్దని, భవిష్యత్తు అంతా బాలికలదేనన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు జ్యోతి, లక్ష్మీదేవి, గౌసియా, కిరణ్ కుమారి, వెంకటలక్ష్మీ, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పల్లాకృష్ణ ఆధ్వర్యంలోనిర్వహించారు.

ఇంటికి దీపం ఆడపిల్ల

వీరపునాయునిపల్లె : ప్రతి ఇంటా దీపంలా వెలుగులు నింపేది ఆడపిల్ల అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయలక్ష్మి అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మండలంలోని తంగెడుపల్లె అర్అండ్ఆర్ కాలనీలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వీరపునాయునిపల్లె సెక్టారులోని 24 సెంటర్ల అంగన్‌వాడీ కార్యకర్తలు, అర్అండ్ఆర్ కాలనీ ఉపాధ్యాయులు పిల్లలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

సమాజంలో స్త్రీ జన్మ ఎంతో ఉన్నతమైంది

వేంపల్లె : సమాజంలో స్త్రీ జన్మ ఎంతో ఉన్నతమైందని.. దాన్ని కాపాడుకున్నప్పుడే విలువ ఉంటుందని వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ అధ్యక్షురాలు డాక్టర్ ఎల్.నాగలక్ష్మీదేవి తెలిపారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ బాలికా దినోత్సవంపై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. అలాగే స్థానిక ఏపీ మైనార్టీ గురుకుల పాఠశాలలో బాలికలతో కలిసి నిర్వహించిన అవగాహన ర్యాలీలో తాళ్లపల్లె పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ షఫివున్నీషా పాల్గొని అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ యోగాంజనేయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుమారి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన పెంచుకోవాలి

వేముల : విద్యార్థులు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా రోడ్డు సేఫ్టీ కమిటీ సభ్యులు జీవీ రమణ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రమైన వేముల జెడ్పీ ఉన్నత పాఠశాలలో రోడ్డు సేఫ్టీ ఎన్‌జీఓ ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు 18 ఏళ్లు నిండిన తర్వాతనే డ్రైవింగ్ లైసెన్స్ తీసుకుని వాహనాలను నడపాలన్నారు. అలాగే మద్యం సేవించి వాహనాలను నడపరాదన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, రోడ్డు సేఫ్టీ ఎన్‌జీఓ జనరల్ సెక్రటరీ శ్రీను, రాము, మల్లి తదితరులు పాల్గొన్నారు.

హోమియోలో అద్భుత చికిత్సలు

కమలాపురం : అన్ని రోగాలకు హోమియో వైద్యంలో అద్భుత చికిత్సలు ఉన్నాయని ప్రభుత్వ హోమియో వైద్యులు షాకీర్ హుసేన్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోమియో వైద్యంలో అద్భుత చికిత్సలు ఉన్నాయన్నారు. చికెన్ గున్యా, మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులైన ఆస్తమా, మోకాళ్ల నొప్పులు తదితర వ్యాధులకు సైతం మంచి చికిత్సలు ఉన్నాయన్నారు. కమలాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళ, గురు, శనివారాలలో అందుబాటులో ఉంటామని, హోమియో వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సరస్వతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

జమ్మలమడుగు : విశాఖ ఉక్కును ఎటువంటి పరిస్థితుల్లో ప్రైవేటీకరణ కానివ్వమని సీపీఐ జిల్లా నాయకుడు వెంకటసుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీపీఐ, ఏఐటీయూసీల ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. నాడు విశాఖ ఉక్కును స్థాపించడం కోసం ఐదువేల కోట్ల రూపాయలు మాత్రమే వెచ్చించారు. కాని కేంద్ర ప్రభుత్వానికి పన్నుల రూపంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ 30 వేల కోట్ల రూపాయలు చెల్లించిందన్నారు. రెండు సంవత్సరాల నుంచి కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అదానికి అప్పనంగా కట్టబెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. దీనిని అడ్డుకుంటామన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపండి

పులివెందుల టౌన్ : రాష్ట్రంలో ఏకైక భారీ పరిశ్రమగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేయడం ఆపాలని వైఎస్సార్ కడపజిల్లా ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కెసి బాదుల్లా, సీపీఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకట్రామలు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీఓ వెంకటేశులుకు వినతి పత్రం అందజేశారు.

మైక్రో వాటర్ షెడ్ నిధులను సద్వినియోగం చేసుకోండి



డైనింగ్ హాలు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న వైఎస్ అభినవ్‌రెడ్డి

లింగాల : మండలంలోని బోనాల గ్రామం మైక్రో వాటర్ షెడ్ కింద ఎంపికైందని.. ఆ నిధులను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని వైఎస్సార్‌సీపీ నేత వైఎస్ అభినవ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం బోనాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేందుకు వాటర్ షెడ్ ప్రావేశిక ప్రోత్సాహక నిధుల కింద డైనింగ్ హాలు నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. పీడీ యధుభూషణ్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో వాటర్ షెడ్ డైరెక్టర్ వెంకట రామమునిరెడ్డి మాట్లాడుతూ వాటర్ షెడ్ యూపీఏ నిధుల కింద రూ.8.37లక్షల వ్యయంతో బోనాల ఉన్నత పాఠశాలలో డైనింగ్ హాలు నిర్మిస్తున్నామని.. అదేవిధంగా పెద్దకుడాల వాటర్ షెడ్ యూపీఏ నిధుల కింద రూ.99వేల వ్యయంతో గ్రామంలో సచివాలయం, బస్టాండులలో సిమెంటు బెంచీలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బోనాలలో వాటర్‌షెడ్ ఎన్ఆర్ఎం కింద వచ్చే మూడేళ్లలో రూ.1.96కోట్ల వ్యయంతో 1902 హెక్టార్ల భూవిస్తీర్ణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శశిధర్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ సాగర్‌రెడ్డి, అడిషనల్ పీడీ శివప్రసాద్, వాటర్ షెడ్ చైర్మన్ శివస్వరూప్‌రెడ్డి, సర్పంచ్ అనురాధ, పెద్దకుడాల వాటర్ షెడ్ చైర్మన్ ప్రగతి, సర్పంచ్ శ్రీదేవి, ఎంపీపీ అమృత, జెడ్పీటీసీ పుష్ప, ఎంపీటీసీ కళ్యాణి, ఎంపీడీఓ సురేంద్రనాథ్, చిన్నకుడాల సర్పంచ్ నాగేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంటు ప్రారంభం

లింగాల : మండల పరిధిలోని బోనాల గ్రామంలో ఆర్‌సీఐ కింద సుమారు రూ.6లక్షల వ్యయంతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంటును మంగళవారం వైఎస్సార్‌సీపీ నేత వైఎస్ అభినవ్‌రెడ్డి, సర్పంచ్ అంకిరెడ్డి అనురాధలు ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గోపాల్‌రెడ్డి, జనార్థన్‌రెడ్డి, వెంకటనారాయణరెడ్డి, ఎంపీడీఓ సురేంద్రనాథ్, ఆర్ఐసీ అధికారులు పాల్గొన్నారు.

అమృత్ సరోవర్ పనికి భూమిపూజ

తొండూరు : మండల పరిధిలోని సంతకొవ్వూరు ప్రాజెక్టు పరిధిలోని ఊడవగండ్ల మైక్రో వాటర్ షెడ్‌లో 1206 హెక్టార్లను గుర్తించి డబ్ల్యూయూడీసీ పీఎంకేఎస్‌వై పథకం రూ.2.65 కోట్లను మంజూరు చేయించి ఎన్ఆర్ఎం కింద అమృత్ సరోవర్ పనికి మంగళవారం వాటర్ షెడ్ డైరెక్టర్ పీవీ ఆర్ఎంరెడ్డి డ్వామా పీడీ యదుభూషన్‌రెడ్డితో కలిసి భూమి పూజ చేశారు. అలాగే ఈపీఏ కింద శివాలయం వద్ద ఏర్పాటు చేసిన సిమెంటు బెంచీలను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో వాటర్ షెడ్ డైరెక్టర్ పీవీఆర్ఎం రెడ్డి, డిప్యూటీ కమిషనర్ శశిధర్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ సాగర్‌కుమార్‌రెడ్డి, అడిషనల్ పీడీ శివప్రసాద్, ప్రాజెక్టు ఆఫీసర్ రఘునాథరెడ్డి, వాటర్ షెడ్ సిబ్బంది మాండవ్య తదితరులు పాల్గొన్నారు.

పరిహారం సొమ్ము పెంచకుంటే భూములివ్వలేము

ప్రజాభిప్రాయవేదికలో ఆర్డీఓతో రైతులు



ఆర్డీఓ శ్రీనివాసులుతో వాదిస్తున్న రైతులు

ముద్దనూరు : ఒక ఎకరా భూమి రూ.40 లక్షల వరకు మార్కెట్ పలుకుతోందని ప్రభుత్వం కేవలం తక్కువ ధరకే భూముల అడుగుతున్నారని పరిహారం సొమ్ము పెంచకుంటే భూములివ్వలేమని రైతులు తేల్చిచెప్పారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆర్డీఓ శ్రీనివాసులు ముద్దనూరు–తాడిపత్రి నాలుగులేన్ల జాతీయ రహదారి నిర్మాణానికి భూసేకరణకు పరిహారం చెల్లింపుపై రైతుల అభిప్రాయసేకరణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు పరిహారం సొమ్ముపై ఆర్డీఓతో వాగ్వాదానికి దిగారు. స్థానిక సిబ్బంది భూసేకరణపై కనీస సమాచారాన్ని కూడా ఇవ్వడంలేదని, ఎకరాకు కేవలం 9 లేదా రూ.10 లక్షల చెల్లిస్తే తాము అన్యాయానికి గురవుతామని, కొంతమంది రైతుల భూముల మధ్యలో రహదారి నిర్మాణం జరుగుతోందని, దీంతో తీవ్ర నష్టం వాటిల్లుతోందని, పరిహారం పెంచితేనే భూములిస్తామని రైతులు తెలిపారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ నేషనల్ హైవే రహదారి పూర్తిగా కేంద్రప్రభుత్వానికి చెందినదని, అలైన్ మెంట్ మార్చలేరని, రాష్ట్ర ప్రభుత్వ నిర్మాణమైతే తమ చేతుల్లో వుంటుందని, రైతుల ఆవేదన తాను అర్థంచేసుకోగలనన్నారు. పరిహారం సొమ్ము తక్కువ అని భావిస్తే రైతులు ఆర్బిట్రేషన్‌కు వెళ్లవచ్చని, రైతుల అభిప్రాయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళడానికి ప్రయత్నిస్తానని ఆర్డీఓ తెలిపారు. రహదారి నిర్మాణానికి మండలంలో సుమారు 32.685 ఎకరాల భూమిని అప్పజెప్పినట్లు అధికారులు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాల్లో నిర్లక్ష్యం వహించవద్దు

హౌసింగ్ పీడీ కృష్ణయ్య



లబ్ధిదారులతో మాట్లాడుతున్న పీడీ కృష్ణయ్య

చెన్నూరు : కనపర్తి జగనన్న లే అవుట్‌లలో చేపట్టబోయే ఇంటి నిర్మాణాల విషయంలో అధికారులు సమన్వయంతో పనిచేసి పనులు పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని హౌసింగ్ పీడీ ఎం.కృష్ణయ్య అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన మంగళవారం కనపర్తి జగనన్న లే అవుట్లలోని గృహ నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, మండలస్థాయి అధికారులు చొరవ తీసుకుని పనులను త్వరగా చేపట్టాలని సూచించారు. అదేవిధంగా లే అవుట్ నుంచి కొండపేట చెరువు వంక వరకు చేపట్టనున్న మెయిన్ డ్రైనేజీని ఆయన పరిశీలించారు. డ్రైనేజీలో ఉన్న నీటిని వంకలోకి వెళ్లే విధంగా చూడాలని ఆయన మండల అధికారులకు తెలియజేశారు. లే అవుట్లలో జరుగుతున్న గృహ నిర్మాణ పనుల విషయంలో నాణ్యతలో ఎక్కడా రాజీ పడకుండా పనులు చేపట్టాలన్నారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లను అందించాల్సిన అవసరం ఉందని ఆయన అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పఠాన్ అలీఖాన్, ఎంపీడీఓ సురేష్‌బాబు, హౌసింగ్ ఏఈ మేనిల్, ట్రాన్స్‌కో ఏఈ రామలింగారెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, కార్యదర్శులు, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలను నెరవేర్చాలి

మెప్మా పీడీ రామ్మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న మెప్మా పీడీ రామ్మోహన్‌రెడ్డి

పులివెందుల రూరల్ : జగనన్న కాలనీల పేరుతో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలతో పేదల సొంతింటి కలను నెరవేర్చాలన్న లక్ష్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారని మెప్మా పీడీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక మెప్మా కార్యాలయంలో మంగళవారం ఆయన పొదుపు సంఘాల మహిళలు, ఆర్పీలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలో 7314 ఇళ్లలు మంజూరయ్యాయని.. అర్హులైన లబ్ధిదారులందరికీ జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మించి లబ్ధిదారుల పేరు మీద రిజిష్టర్ చేసి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎన్నడూలేని విధంగా అనుబంధ ఫారాలు ఇవ్వకుండా వారి పేరు మీద రిజిష్టర్ చేసి వారికి ఇళ్ల పట్టాలు ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఆర్పీలు కూడా తమ పరిధిలోని ఉన్న మహిళలచే రూ.30 వేలు చెల్లించే విధంగా వారికి అవగాహన కల్పించాలన్నారు. అలాగే పొదుపు సంఘాల మహిళలందరూ పంచ సూత్రాలు తప్పని సరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ నారాయణరెడ్డి, ఏపీఎం ఆంజనేయులు, మెప్మా అధికారి గంగులయ్య, సీఓలు నాయుడు, హరిత, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు ఫేషియల్ యాప్‌ను రద్దు చేయాలి

కమలాపురం : అంగన్వాడీలకు ఫేసియల్ యాప్‌ను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులరెడ్డి తెలిపారు. మంగళవారం కమలాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఎదుట ధర్నా నిర్వహించి వారు మాట్లాడారు. లబ్ధిదారులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహార క్వాంటిటీని పెంచాలన్నారు. అంగన్వాడీ సెంటర్లలో వసతులు మెరుగు పరచాలని, పర్యవేక్షణ పేరుతో చేస్తున్న వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలన్నారు. పెండింగ్‌లో ఉన్న టీఏ, డీఏలను చెల్లించాలన్నారు. గ్రామాల్లో నెట్ సౌకర్యం సరిగా లేదని, దీంతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారని, ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఫేస్ యాప్‌ను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలోఅంగన్వాడీ నాయకురాళ్లు సుబ్బలక్ష్మీ, ఉమ, గాయత్రి, భారతి, శివలీల, రమాప్రభ, రాధిక, ఉషా, కళావతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేలను తనిఖీ చేసిన విజిలెన్స్ అధికారులు



కమలాపురం-1 వార్డు ఆర్‌బీకేను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

కమలాపురం : పట్టణంలోని నాలుగు రైతు భరోసా కేంద్రాలను మంగళవారం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. కడప రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి, ఏఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు ఆ శాఖ అధికారులైన ఇదురు బాషా, బాల గంగాధర్‌రెడ్డి, విజయ్‌కిషోర్, గంగిరెడ్డి, జనార్దన్‌రావు, నాగేశ్వరరావు, ఇనయతుల్లాలు రెండు టీంలుగా ఏర్పడి కమలాపురం 1, 2, 3, 4వ వార్డు ఆర్‌బీకేలను తనిఖీ చేసి ఆర్‌బీకే సిబ్బంది హాజరును, రికార్డులను పరిశీలించారు. యంత్ర సేవాకేంద్ర నిర్వహణ, విత్తనాలు, ఎరువుల సరఫరా, పొలంబడి, పంటల బీమా అమలు తీరు తెన్నులపై సిబ్బందితో ఆరా తీశారు. ధాన్య సేకరణను పరిశీలించి సిబ్బందికి తగు సలహాలు, సూచనలు అందజేశారు. తనిఖీ చేసిన అంశాలను నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు నివేదిస్తామని వారు తెలిపారు. ఏడీఏ నరసింహారెడ్డి, ఏఓ సరస్వతి, ఏఈఓలు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో రాణించిన గురుకుల విద్యార్థులు



విజేతలుగా నిలిచిన గురుకుల విద్యార్థులు

కమలాపురం : స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు కర్లింగ్ పోటీలలో జాతీయ స్థాయిలో రాణించారని ప్రిన్సిపాల్ తులసమ్మ తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈనెల 8న జమ్ముకాశ్మీర్‌లో జరిగిన కర్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీల్లో తమ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు రెండు ఈవెంట్లలో పాల్గొని వెండి, రజత పతకాలు సాధించారని ఆమె తెలిపారు. బి.దీక్షిత (మిక్సిడ్ డబుల్స్), ఎల్.అమ్ములు(టీం, మిక్సిడ్ డబుల్స్), ఎస్.పూజిత(టీం, మిక్సిడ్ టీం), కె.హారిక (టీం, మిక్స్‌డ్ టీం) కర్లింగ్ క్రీడల్లో రాణించారని ఆమె అన్నారు. దీక్షిత ఖేలో ఇండియా పోటీలకు సెలెక్ట్ అయిందని, ఈ పోటీలు ఫిబ్రవరి 9 నుంచి జమ్ముకాశ్మీర్‌లో జరుగుతాయని ఆమె వివరించారు. అలాగే దీక్షిత స్వీడన్‌లో జరిగే ఇంటర్నేషనల్ పోటీలకు సెలెక్ట్ అయిందన్నారు. మా పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి పోటీల్లో రాణించడానికి తమ పీడీ ఘన్సీ లక్ష్మీబాయ్ మంచి శిక్షణ ఇవ్వడంతోనే సాధ్యమైందన్నారు. ఖేలో ఇండియాతో పాటు, స్వీడన్‌లో జరిగే పోటీల్లో తమ విద్యార్థులు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆమె క్రీడాకారిణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ విజయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫ్యాక్షన్ గ్రామాలపై నిఘా ఉండాలి

డీఎస్పీ నాగరాజు



పోలీస్ పికెట్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ నాగరాజు

మైలవరం (జమ్మలమడుగు రూరల్) : ఫ్యాక్షన్ గ్రామాలపై నిరంతరం నిఘా ఉండాలని పోలీస్ అధికారులకు డీఎస్పీ నాగరాజు సూచించారు. మంగళవారం రాత్రి జమ్మలమడుగు రూరల్ సీఐ టి.వి.కొండారెడ్డి, తలమంచిపట్నం ఎస్ఐ గోపీనాథ్‌రెడ్డిలతో కలసి ఆయన చిన్నకొమెర్ల గ్రామంలో ఏర్పాటుచేసిన పోలీస్ పికెట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ఉన్న ఫ్యాక్షన్ గ్రామాల్లో నిరంతరం నిఘా పెట్టి రౌడీషీటర్ల కదలికలపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.